

TRIVENI
BETEL NUT POWDER
PRIDE OF INDIA
CHOICE OF MILLIONS
TRADE MARK REGD. NO. 169609
త్రివేణి
ತ್ರಿವೇಣಿ
ത്രിവേണി
திருவேணி
त्रिवेणि
BEST PICKED
FRESH PACKED
TRIVENI
PARIMALA
NUT POWDER
TRIVENI
GOPAL NUT POWDER WORKS
Prop: DESU BABURAO
AUTHORSIED MANUFACTURERS OF TRIVENI NUT POWDER
NIZAMPET — MACHILIPATNAM (A. P.)
Phone: 488
VIJAYA


తిరిగిరాని క్షణాలు
ముళ్ళపూడి నాగేశ్వరరావు

సిగరెట్ మళ్ళీ ఆరిపోయింది. తడిసిపోయిన మీద కాబోలు మళ్ళీ మళ్ళీ ఆరిపోతోంది. వెలిగిద్దామా వద్దా అని ఆలోచిస్తుండగానే ఆ సిగరెట్ చేతిలోంచి జారిపోయింది. అతను మళ్ళీ ఆలోచనలలోకి జారిపోయాడు. తనని మిగతా రిక్షావాళ్ళని విడదీసేది ముఖ్యంగా ఆ సిగరెట్టే. తనకు తెలుసున్న రిక్షావాళ్ళెవళ్ళూ సిగరెట్ కాల్చరు. అందరూ చుట్టో, బీడీనో కాలుస్తారు. కాని తనకు మాత్రం స్టూడెంటు రోజుల్లోని అలవాటు మిగిలిపోయింది. తను చదువుకున్న పన్నెండు సంవత్సరాల చదువు, తన గుర్తుగా మిగిల్చిపోయిన వస్తువు—సిగరెట్.

టైమెంతయి వుంటుందో? ఒంటి గంటవుతుందేమో. అతను లోపలికెళ్ళి అరగంటవుతుంది కాబోలు. ఏమో ఈ చీకటిలో, కటిక చీకటిలో జారిపోయిన టైమెంత? అతనింకా ఎంతసేపుంటాడో లోపల? ఎంత సేపయినా వుండచ్చు. మరో రెండుగంటలు, మరో మూడు గంటలు. అవును అతనామెని ఆ రాత్రికి కొనుక్కున్నాడు. ఆ రాత్రి ఆమె సర్వస్వం అతనిది.

ఆమె. ఆమె గుర్తుకొచ్చేసరికి అతని గుండెల్లో ఏదో అయ్యింది.

ఆమె నిన్న అందగత్తె, నేడు అందగత్తె, రేపుకూడా అందగత్తె. ఆమె అందం సూర్యుడిలా మార్పులేనిది. ఎంతమంది మూర్ఖుల చేతుల్లో పడి నలిగినా చెక్కు చెదరదు ఆమె అందం.

ఆమెను ఊహించడానికి ప్రయత్నించాడు. ఊహించేడు. కాని ఆమె సంపూర్ణమయిన విగ్రహాన్ని ఊహించలేక పోయాడు. విసుక్కున్నాడు. మళ్ళీ సంబాళించుకున్నాడు. అవును ఆమె అందం ఊహాతీతమైనది.

మళ్ళీ ఆమెని ఊహించడానికి ప్రయత్నించాడు. ఇప్పుడామె ఎలా వుంటుంది? అతని శరీరం మంచుగడ్డలా అయిపోయింది. ఆ మోటు మనిషి చేతుల్లో నలిగిపోతూంటుంది. నవ్వుతూంటుందేమో? అవును నవ్వక తప్పదు కదా మరి. తాగుతూంటుందేమో? రిక్షా దిగేటప్పుడు వాడి చేతిలో సీసా వుందో లేదో చూడలేదు—చీకటివల్ల.

వాటి బండపెదాలు మందార రేకుల్లాంటి ఆమె సున్నితమైన పెదాల్ని....ఒళ్ళు జలదరించింది అతనికి. ఉద్రేకం ఉప్పొంగింది. తలుపు బద్దలుకొట్టి లోపలికి వెళ్ళి ఆమెని విడిపించాలనిపించింది. అలా చేస్తే ఆమె తనకేసి యెలా చూస్తుందో? కోపంగా చూస్తుందా? అసహ్యంగా చూస్తుందా? భయంగా చూస్తుందా? లేక జాలిగా చూస్తుందా? కాని తనా పని చెయ్యలేడు. అయినా అతనామెనేం బలవంతం చెయ్యటంలేదుకదా? అతను కొనుక్కుంటున్నాడు. ఆమె అమ్ముకుంటోంది. సింపుల్. క్వయిట్ సింపుల్.

ఆమె అసలు ఎందుకీ వృత్తిలోకి ప్రవేశించిందో? అసలు తనెందుకీ వృత్తిలోకి ప్రవేశించాడు? రోజులు గడవడంకోసం.

అతనామెను యేం చేస్తూంటాడు?


ఆమె ఆకర్షణీయమైన కళ్ళల్లోకి ఒక్కసారి కళ్ళెట్టి చూస్తే, ఆమె నున్నని చెంపల్ని ఒక్కసారి స్పృశిస్తే, ఆ లేత ఎరుపు పెదాల్ని ఒక్కసారి ముద్దెట్టుకుంటె ఆమె పొడవైన ముక్కుని తన ముక్కుతో ఒక్కసారి అటూ ఇటూ కదిపితే, ఆమె అందమైన గుండెల్లో తల దాచుకుంటే....జీవితం ధన్యమయినట్టే.

అతని నరాల్లో విచిత్రమైన సంచలనం కలిగింది. పాతికేళ్ళ అతని వయస్సు అతని మనస్సులో తీవ్రమైన కోర్కెను రేపింది.

చీకటిలోకి చూశాడు. కళ్ళు బాగా తెరిచి చూశాడు. ఏం కనిపించలేదు. ఆ చీకటి నేటి రోజులా వుంది. అంతలో ఆ చీకటిలో ఆమె రూపం కనిపించింది అస్పష్టంగా. అది భ్రాంతి అని తనకు తెలుసు.

ఇంతకీ తనెవరు? అఫ్టాల్ ఓ రిక్షా లాగేవాడు. చిన్నప్పుడు హిస్టరీ మాస్టరంటూండేవాడు. "మీకంటే ఆ రిక్షా లాగేవాళ్ళు నయంరా" అని. అప్పుడా విషయం ఆలోచించలేదు. ఇప్పుడాలోచిస్తుంటే ఆయనలా ఎందుకన్నాడో అర్థంకావడంలేదు.






పల్లకీ ఎక్కినవాడికంటే మోసేవాడు గొప్పవాడనుకునేవాడు ఆ రోజుల్లో. కాని యిప్పుడలా అనిపించడంలేదు. తను చేస్తున్నది తక్కువపనా? ముమ్మాటికీ. "'ఎద్దులా రిక్షా తొక్కుతూ, బెల్ కొడుతూ, సైడు బాబూ సైడంటూ...." ఓహ్ ఏవిటీ జీవితం?

అసలు తనెందుకు రిక్షా లాగాల్సొచ్చింది?

తప్పెవరిదీ? ఈ కాలానిదా? ఈ దేశానిదా? తన పరిస్థితులదా? లేక నిజంగా తన అసమర్థతదా?

పన్నెండు సంవత్సరాలబాటు రోజుకి ఐదు గంటల చొప్పున తను స్కూల్లో గడిపిన సమయం అతి వ్యర్థమేనా? తను నేర్చుకున్న చదువు....నిజంగా తనేమన్నా నేర్చుకున్నాడా?

ఏది యేమైనా తనీ పని మొదలుపెట్టేవాడు కాదుకాని "ఆతన్ని" చూశాక....అతనూ, తనూ ఆరోక్లాసువరకూ కలసి చదువుకున్నారు. అతనికీ తనకీ మధ్య నున్న ఒకే ఒక సామాన్య విషయం బీదరికం. అతనెప్పుడూ ఫస్టు బెంచిలో కూర్చునేవాడు. అతనికెప్పుడూ ఫస్టుమార్కొచ్చేది. అతను రాకపోతే మాస్టారందరూ ఎందుకు రాలేదని అడిగేవారు. "నేచురల్ సైన్స్" మాస్టారయితే పాఠం చెప్పేవారు కాదు కూడా.

అప్పటికి తను టెన్త్‌క్లాస్ పూర్తి చేసి మూడు సంవత్సరాలయ్యింది. నిరుద్యోగిగా ముఫై ఆరు నెలల అనుభవం గడించాడు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. అమ్మ కష్టపడి తెచ్చే డబ్బుమీద ఆధారపడి బతుకుతున్నాడు. అమ్మకి జబ్బుచేస్తే చూపించడానికి ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. తిరిగొస్తూ రిక్షా పిలిచాడు.

"ఛార్జీసు దగ్గరకి ఏవి...." ఆగిపోయాడు ఆ ముఖంచూసి.

"నువ్వు...." ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎక్కు" అన్నాడతను. అప్పటికే అమ్మ ఎక్కేసి కూర్చుంది. ఇంటికెళ్ళిన తర్వాత అతన్ని ఇంట్లోకి పిలిచాడు. అతను తన పరిస్థితిని సంక్షిప్తంగా ఇలా చెప్పేడు.

"బియ్యేస్సీ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను కాని వెంటనే ఉద్యోగం వొస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అలాగే రాలేదు. అదొచ్చేవరకూ ఆగే శక్తి నాకులేదు. ఇంకా ఎన్నాళ్ళు ఎప్పుడు ఆగిపోతుందో తెలియని గుండెతోటి అమ్మ రోజుకి పదిగంటలు పనిచేస్తుంది? అందుకే ఈ పని మొదలుపెట్టాను."

లేచి వెళ్ళిపోతూ అన్నాడతను "బ్రదర్ ప్రతివాడికీ అదృష్టం ఎప్పుడో తగుల్తుంది. కాని ఎప్పుడో చెప్పలేం. దానికోసవని కాచుక్కూచోవడం అంత మంచిపనికాదు" అతను

వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ తనలోని "ప్రిస్టేజ్", "స్టేటస్" లాంటి దౌర్బల్యాల్ని తీసుకుపోయాడు.

తను రిక్షా తొక్కడానికి అమ్మ అభ్యంతర పెడుతుందనుకున్నాడు. కాని ఆమె అభ్యంతర పెట్టలేదు. అవును ఆమె వంటలు వండివండి తనే ఉడికిపోయింది.

నిరాశావాదులు గతాన్ని, ఆశావాదులు భవిష్యత్తునీ తల్చుకుంటూంటారుట. కాని తను నిరాశా వాదయ్యుండి ఎప్పుడూ భవిష్యత్తు గురించి కలలు కంటూ వుంటాడు. అవి నిజం కావని తెలుసు. కాని వర్తమానం నుంచి తప్పించుకోవడానికదో మార్గం.

మళ్ళీ ఆమె గుర్తు కొచ్చింది. ఆమె ఇప్పుడు ఏం చేస్తూ వుంటుంది? వెన్నెలలాటి ఆమెనిచీకటిలా ఆక్రమించుకుంటూ వుంటాడు వాడు.

చలి విపరీతంగా వేస్తోంది. చిరిగిపోయిన మఫ్లర్‌ని మరింత గట్టిగా చుట్టుకున్నాడు. ఈ చలిలో....తన అదృష్టం బావుంటే "ఆమె" లాటి అమ్మాయిని కౌగలించుకుని వెచ్చని రగ్గు కింద పడుకుని వుండాల్సింది.

కాని ప్రస్తుతానికి తను రిక్షా తొక్కుతూ, బ్రోకర్ పనిచేస్తున్నాడు. అవును ఇదే నయం. పెద్ద కష్టపడకుండానే రాత్రికి పది రూపాయి లొస్తాయి.

ఆమె వెడల్పయిన కళ్ళల్లో ఎంత ఆకర్షణ? తనకి కవిత్వం రాదు ఆమెని వర్ణించడానికి. టెన్తు క్లాసులో పరమహంసనే ఫ్రెండుండే వాడు. అతనెంత బాగా కవిత్వం చెప్పేవాడో. వైజాగ్‌లో మెడిసిన్ చదువుతున్నాడని విన్నాడు. వాడు కనిపించినా బాగుండును. ఏదేనా ఉద్యోగం ఇప్పించేవాడు.

"నిద్రపోతున్నావా?" బొంగురుగా పలికిందా కంఠం.

"లేదుసార్". తను రిక్షా దిగాడు. ఆయ నెక్కాడు.

అతనాపమన్నచోట ఆపాడు. అతను రిక్షా దిగి ఐదు రూపాయిల కాయితం చేతిలో పెట్టాడు. తను దానికేసి చూడకుండా జేబులో పెట్టుకున్నాడు.

రిక్షా వెనక్కి తిప్పాడు. రిక్షా ఆమె ఇంటి గుమ్మం ముందు ఆగింది. తలుపు తట్టాడు.

"ఎవరదీ" సన్నగా పలికిందా కంఠం. ఆ కంఠంలో విసుగు ధ్వనించింది.

అతను మాట్లాడలేదు. తనమీద తనే చిరాకు పడ్డాడు ఆమెను విసిగించినందుకు.

తలుపు తెరుచుకుంది. ఆమె నిలబడి వుంది. అలసటో నిద్రో సరిగ్గా తెలియటల్లేదు కాని ఆమె ముఖాన్ని ఆవరించుకుని వుంది. ఆమె నలిగిపోయిన తెల్లచీర కట్టుకుని వుంది. ఆమె నలిగిపోయిన తెల్లచీరలా వుంది.

ఆమె నవ్వలేదు. నవ్వడానికి ప్రయత్నించింది.

"ఏం కావాలి?" అని అడగలేదు. కాని అతనికి ఆమె చూపులలా అడిగినట్టనిపించాయి.

అతను మాట్లాడటానికి ప్రయత్నించాడు కాని మాట్లాడలేకపోయాడు.

"ఓహ్ ఐదు రూపాయి లివ్వాలికదూ!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మరో రెండు నిమిషాల్లో తిరిగొచ్చి "ఐదు లేదు. అతను మూడు పదులిచ్చాడు. మళ్ళీ సారిది కూడ కలిపి ఇస్తాను"

ఆమె పెదాలు కదులుతున్నాయి. అది మాత్రమే తెలుస్తుందతనికి.

అతను కదలలేదు. ఆమె అతను వెళ్ళిపోతాడేమో అనుకుంది.

"ఇప్పుడంత అవసరమా అయితే పది తీసుకోండి."


అతను తేరుకున్నాడు. "అహ ఒద్దు" అంటూ వెనక్కి తిరిగాడు.

* * *

ఎక్కడో చదివాడు ఏదేనా ఒక బలమైన కోరిక పుడితే అది ఒక పట్టాన చావదు కదా మనిషిని చంపినంత పని చేస్తుంది. ఆ కోరిక పోవాలంటే ఒకటే మార్గం. అది ఆ కోర్కెని తీర్చుకోవడం.

ఎంత ఆలోచించినా అదే మంచిదనిపించింది.





ఆమె వెచ్చని నడుము చుట్టూ తన చేతులు బిగుసుకోవడం-అనే మధురమైన ఆలోచనతో అతను ఉక్కిరి బిక్కిరయిపోయాడు.

కాని మరో ప్రశ్న. అందరిలాగే తను ఆమె అందాన్ని డబ్బుతో కొనుక్కోగలడా? తనకా ధైర్యం వుందా? అప్పుడతనికి తనచేత పరమహంస బలవంతంగా చదివించిన ఓ కథ గుర్తొచ్చింది. ఆ కథలో రచయిత చివరన వాపోతాడు "సృష్టిలో అతి విలువైన, విలువ కట్టలేని వస్తువు విలువ రూపాయిన్నర" అని.

అలా చెయ్యడం ఆమెని అవమానించినట్టు కాదా? నిజం చెప్పాలంటే అలా చెయ్యడం తన మనస్సునే అవమానించడం.

మరేం చెయ్యాలయితే? ఇలాగే ఆమెని చూస్తూ వుండిపోవడమేనా? ఎంతకాలం?

ఆ రాత్రి ఆమె కలలోకి వచ్చింది. తెల్లటి చీరలో జుత్తు విరబోసుకుని మబ్బులమీద నడుస్తోంది. తనని పిలుస్తోంది. ఇంక ఆగలేక పోయాడు "ఏమయితే అయ్యింది" తనలో తనే అనుకున్నాడు.

ఆ వేళ రిక్షా తొక్కడానికి వెళ్ళలేదు. రాత్రి భోజనం అయిపోయిన తర్వాత ఈ మధ్యనే కుట్టించుకున్న తెల్ల షర్టు, నీలంరంగు పాంటు వేసుకున్నాడు. పక్కింటి రాజేశ్వరి నడిగి పౌడరు డబ్బాతీసుకొచ్చి పౌడర్ రాసుకున్నాడు. ఎక్కువయి పోయినట్టనిపించింది. జేబురుమాలుతో తుడిచాడు. పౌడరంతా చెరిగిపోయింది. మళ్ళీ రాసుకున్నాడు. మళ్ళీ ఎక్కువయిపోయి నట్టనిపించింది. జేబురుమాలుతో తుడిచాడు. జుట్టు దువ్వుకోవడంలో కూడ అలాటి కష్టమే ఎదురయ్యింది.

"ఎక్కడికిరా శోభనం పెళ్ళికొడుకులా తయారయి వెళుతున్నావు?" సత్యం పలకరించాడు.

"అబ్బే ఏదో చిన్న పనిమీద...." నసిగేసేడు. గుండె దడదడలాడింది. "కనిపెట్టేసి నట్టున్నాడు వెధవ" అనుకున్నాడు.

అతని మనసు పరిపరివిధాల పోతోంది.

ఆమె ఒప్పుకుంటుందా? ఎందుకొప్పుకోదు? తనూ పాతిక రూపాయిలిస్తాడు. గుండెల్లో ఏదో భయం మొదలయ్యింది. ఆమె ఒప్పుకోదేమో. "నువ్వా. నీకూ నేను కావాలా? ఏవిటి డబ్బిస్తానంటున్నావా? డబ్బిస్తే మాత్రం నీలాటి మోటు మనిషితోటి, రిక్షా తోక్కేవాడితోటి నాకు సరసమేవిటి? నీ చపలకంపూ నువ్వూను" అంటే.

తను భరించలేడు—అలాటి అవమానాన్ని. అతనికి నీరసం వచ్చినట్టయ్యింది. వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనిపించింది. కాని కాళ్ళు ముందుకే కదిలాయి. జీవితంలో ఎన్ని అవమానాలు భరించలేదు. ఇదొక లెక్కకాదు.

ఆమె ఇంటి తలుపు తట్టేటప్పుడు కూడ ఆలోచించాడు. కాని కోరిక అతనిలోని భయాల్ని అదిమి పట్టింది.

తలుపు తెరుచుకుంది. ఆమె నిలబడివుంది. ఎప్పటిలానే — అందంగా జాలిగా నవ్వుతూ. కాని అతనే ఎప్పటిలా రాలేదు. అతని శరీరం కంపిస్తోంది. అతను ఆమెకేసి చూశాడు. ఆ చూపుల్లో ఆరాధన, ఆవేశం, కోరిక, భయం ఇంకా ఏవో అనిర్వచనీయమైన భావాలు వున్నాయి.

"ఏవిటి?" మందారం రంగులో వున్న ఆమె క్రిందపెదవి, పై పెదవి నుంచి విడివడి కిందకు కదిలి మళ్ళీ పై పెదవిని చేరుకుంది. ఆ కదలికను చూస్తూ అలా వుండిపోయాడతను.

"ఏవిటి ఈవేళ రిక్షా తొక్కటల్లేదా?" అడిగింది ఆమె అతని వేషంలోని మార్పుని గమనించి.

"లేదు."

"ఏం?"

అతను మాట్లాడలేదు. చివరకు అన్నాడు. "నేను లోపలికి రావచ్చా."

ఆమె అలాటి మాటను ఊహించినట్టులేదు. తత్తరపడింది "అహ రండి, రండి" అంటూ గుమ్మానికి అడ్డు తొలగింది. అతను లోపలికి నడిచాడు. అదే మొదటిసారి అతను ఆమె ఇంట్లోకి ప్రవేశించడం.

ఎలా చెప్పాలో అతనికి తెలియటల్లేదు. పరిస్థితి ఏవిటో ఆమెకు అర్థం కావడంలేదు.

"కొంచెం మంచినీళ్ళిస్తారా?" అడిగాడు. అవును అతనికి నోరెండిపోతోంది. ఆమె లోపలికి వెళ్ళింది. అమ్మయ్య అని అతను ఊపిరి పీల్చుకున్నాడు. ఇంతలోనే ఆమె గ్లాసూ నీళ్ళతోటి గదిలోకి వచ్చింది.

ఆమె నడిచివస్తుంటే ప్రపంచంలోని అందమంతా ఒక స్త్రీమూర్తిగా మారి నడచివస్తోందా అన్నట్టుగా వుంది. ఆమె కళ్ళల్లోంచి, దయా, జాలీ, ప్రేమ, కరుణాలాటివన్నీ ఒక కాంతి పుంజంగా మారి ప్రసరిస్తున్నట్టున్నాయి.

ఆమెని చూస్తుంటే అతనికి వందల సంవత్సరాల క్రితం అంతఃపురాల్లో మ్రగ్గిపోయిన అందగత్తెలు గుర్తుకొచ్చారు.

"తీసుకోండి" అంది ఆమె.

అతని చెయ్యి వొణికింది. నీళ్ళు కొద్దిగా ఆమె చేతిమీద ఒలికాయి.

"థాంక్యూ."

ఆమె నవ్వింది రేకమందార పువ్వు విచ్చుకున్నట్టుగా.

ఆమె కళ్ళు కుతూహలంగా చూస్తున్నాయి.

ఆ క్షణం వచ్చింది. వచ్చేసింది.

చటుక్కున అతను ఆమె చేతిని పట్టుకున్నాడు "నేనీ రాత్రిక్కడే వుంటాను."

ఆమె అతనికేసి ఆశ్చర్యంగా చూసింది.

"ఏవిటి?" అంది తేరుకుంటూ.

"వదలండి" అంది ఆశ్చర్యంనుంచి తేరుకుంటూ.


"నేనుకూడ డబ్బిస్తాను". ఆ మాట అతను అనకూడదనుకున్నాడు. కాని అనేశాడు.

"అహ అదికాదు" ఆమె జాలిగా నవ్వింది. "డబ్బు గురించి కాదు. మిమ్మల్ని చాలా కాలంనుంచి చూస్తున్నాను. మీరు వేరు, మిగతా వాళ్ళు వేరు. మీరు మంచి వాళ్ళు. మీరు నాలాంటిదాన్ని కోరడం న్యాయంకాదు."

ఆమె చివరి మాటల్ని అతను వినిపించుకోలేదు. ఆమె ముందరి మాటలు అంతవరకూ అతనిలో అణగివున్న కోర్కెను బయటకు








నెట్టాయి.

అతని చేతులు ఆమె దేహాన్ని ఆత్రుతతో చుట్టుకున్నాయి.

"వొద్దు. ప్లీజ్ వొద్దనద్దు. మీరు నాకు కావాలి."

ఆమె మళ్ళీ నవ్వింది—అందంగా జాలిగా.

ఆ నవ్వు ఆ గదిలో వాతావరణాన్ని పూర్తిగా మార్చేసింది. అతన్ని ఏవేవో లోకాలకు తీసుకుపోయింది. ఆరునెలలుగా ఆమెపట్ల వున్న కోరికలన్నీ అతని పెదవుల్లో చేరాయా అన్నట్టుగా అతని పెదవులు ఆమె పెదవుల్ని అద్దుకున్నాయి.

నిముషం, రెండు నిముషాలు....కాలం ఆగిపోయింది.

"అబ్బ వదలండి నాకు ఊపిరి ఆడటల్లేదు" అంది ఆమె సుతారంగా విడిపించుకుంటూ.

కాని అతను వొదలలేదు — కాదు వొదలలేడు. అతని వెచ్చని ఊపిరి ఆమె చెంపల్ని, కనురెప్పల్నీ, మెడనీ, చెవుల్నీ కితకితలతో నింపేసింది.

ఆ రాత్రి మంచం, మంచంమీదున్న పరుపు, గదిలో సువాసనలు నింపే అగరొత్తులు, కిటికీ పక్కనే వున్న బోగన్‌విల్లా ఆ గదిలో వాతావరణంలో ఏదో కొత్తదనాన్ని కనిపెట్టాయి. ఆ రాత్రి ఆదమరచి నిద్రపోతున్న ఆ జంటనుచూసి నిశ్శబ్దం నిశ్శబ్దంగా నవ్వుకుంది.

తెల్లారగట్లలేచి వెళ్ళిపోతూ జేబులో వున్న పాతిక రూపాయలూ తీసి బల్లమీద పెట్టేడు.

"వొద్దు" అంది ఆమె.

"అహ ఫర్వాలేదు. ఉంచండి" అన్నాడు.

ఇంకా అతను ఆమెని నువ్వు అనలేకపోతున్నాడు.

ఆమె ఆ రూపాయి నోట్లని మడతపెట్టి అతని జేబులో పెట్టింది.

"మిమ్మల్నికూడ ఈ ఇంటికి వచ్చే మిగతా అందరితోను సమానంగా చూడలేకపోతున్నాను నేను. అందుకే వద్దు."

అతను మాట్లాడలేదు, ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

"మళ్ళీ ఎప్పుడు రాను?"

ఆమె నవ్వింది. అతను ఆమెవేపు అడుగువేసి ఆమె కనురెప్పలమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చాలాకాలం తర్వాత ఆమె మళ్ళీ ఏడ్చింది.

ర ర ర

ఆతరవాత అలాటిరాత్రులు చాలాగడిచాయి.

వాళ్ళిద్దరి హృదయాల మధ్యవున్న గోడలు కరిగిపోయాయి.

అతని పరిస్థితులగురించి ఆమెకి, ఆమె పరిస్థితుల గురించి అతనికి అవగాహన కలిగింది. ఆమె తల్లి గురించి, పెళ్ళవ్వవలసిన చెల్లిలి గురించి, వాళ్ళపట్ల తనకున్న బాధ్యత గురించి, ప్రేమగురించి, చాలా చాలా చెప్పింది ఆమె. వాళ్ళు తనమీద ఎలా అధారపడి వున్నారో, తను తననీడ వాళ్ళమీద పడకుండా వాళ్ళకి ఎలా సహాయం చేస్తున్నది అతనికి వివరించింది.

ఒకరాత్రి అన్నాడతను. "నీకో విషయం చెబుతాను నవ్వవుకదా?"

"ఏ విషయం!"

"ఏదో ఒకటి. నవ్వనని సీరియస్‌గా తీసుకుంటానని సరిగ్గా సమాధానం చెబుతానని ప్రామిస్ చెయ్యి."

"ప్రామిస్. నువ్వేలాటి జోకేసినా ఆఖరికి నన్ను పెళ్ళి చేసుకుంటానన్నా నవ్వను సరా." అందామె అతని గుండెలపై తన చెవిపెట్టి వింటూ.

"అవును. మనం పెళ్ళిచేసుకుందాం."

నవ్వుతూ తలెత్తిన ఆమె అతని కళ్ళల్లోని సీరియస్‌నెస్ చూసి షాక్ అయిపోయింది.

"అవును ఇది జోక్‌కాదు. నువ్వు నాకు కావాలి. నువ్వు లేకుండా బతకలేను నేను."

"ఇప్పుడూ నీదాన్నే కదా?"

"ఇలాకాదు. పూర్తిగా."

ఆమెకేం మాట్లాడాలో తెలీలేదు.

"నేనెలాగైనా ఉద్యోగం సంపాదిస్తాను. కష్టపడి పనిచేస్తాను. మీవాళ్ళ విషయంకూడా నేనే చూస్తాను" ఆవేశంగా చెబుతున్నాడతను. ఆమె అతనికేసి విచిత్రంగా చూస్తూ కూర్చుంది.

* * *

పందొమ్మిదివందల డభై ఎనిమిది ఫిబ్రవరి ఇరవయ్యొకటో తారీకున జరిగిన అనేక పెళ్ళిళ్లలో వాళ్ళది ఒకటి-అనేక రకాల పెళ్లిళ్లలో వాళ్ళది ఒకటి.

"రిజిస్ట్రారాఫీసులో...."

"వొద్దు" అంది ఆమె అతనిమాట కద్దు తగులుతూ.

"మరి!" అన్నాడతను ఆశ్చర్యంగా.

"మనింట్లోనే చేసుకుందాం" అంది ఆమె నవ్వుతూ.

"ఎలా?" ఎలాగో చెప్పింది ఆమె. ఆ రోజు దేవుడి ఫొటో కెదురుగా ఆమె మెడలో పసుపుతాడు కట్టేడతను.

"మనగురించి ఎవరేం అనుకుంటారా? అని నువ్వు భయపడనక్కరలేదు" ఆ రోజు రాత్రి ఆమె ఒళ్ళో తల పెట్టుకుని పడుక్కున్నప్పుడు చెప్పాడతను.

"రేపటినుంచి మళ్ళీ రిక్షా లాగుతాను."

"వొద్దు" అంది ఆమె. "వొద్దు ఏదేనా ఉద్యోగానికి ట్రైచెయ్యండి. ప్రస్తుతానికి నా బాంక్ ఎకౌంట్‌లో డబ్బుంది. దాంతో మనం కొంతకాలం గడపవచ్చు. ఈలోపల మీకు ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. అప్పుడు మీరు ప్రైవేటుగా చదువుకోవచ్చు. త్వరలోనే పెద్ద పోస్టులో కెళతారు."

"నేనంటే నీకెంత నమ్మకం."

మర్నాటినుంచి అతను ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టేడు. రెండు సంవత్సరాల కాలంలో ఉద్యోగావకాశాలు మరింత తక్కువయ్యాయి కాని పెరగలేదు.

ఇంటర్వ్యూలు వొస్తున్నాయి, వెళుతున్నాయి. ఉద్యోగం రావటల్లేదు.

"పర్వాలేదు పర్వాలేదు" అంటోందామె.

కాని ఎందుకో కొత్తలో వున్న హుషారు ఆనందం ఇప్పుడు లేవు.


"ఈ ఉత్తరం చూస్తారా?" అడిగిందామె.

"ఏదీ?" పరాగ్గా అందుకున్నా డతను.

"అక్కా-

నువ్వే కారణం వలనో కిందటి నెలా, ఈనెలా డబ్బు పంపలేదు. మాకేం చెయ్యాలో తెలీటల్లేదు. బావగారికి మాకు పంపడం ఇష్టంలేదా? అక్కా- ఈనెల ముందర పదిహేను రోజులు నేనూ, అమ్మా, చంద్రం ఒక





పూట భోజనం చేశాం. మొన్నటినుంచి అసలు భోజనం చెయ్యలేదు. ఎలాగో తెలీటల్లేదు. మామీద దయ ఉంచి డబ్బు పంపు. ఇంకా నా చదువు ఆరు నెలలుంది. ఆ తర్వాత నిన్నడగం. బావగారి నడిగేనని చెప్పు. నీ మనసు కష్టపెడితే క్షమించు—

రాజ్యం."

"డబ్బెందుకు పంపలేదు?"

ఆమె పాస్‌బుక్ అతని చేతిలో పెట్టింది. అందులో ఎకౌంట్ క్లోజ్ అయిపోయింది. చివరి ఐదురూపాయలు కూడ పదిహేనురోజుల క్రితం తీసేయబడ్డాయి. డబ్బూ, అమ్యూనిషన్ ఉన్నంతకాలం వాటి విలువ తెలీదు. అవి అయిపోతే జీవితం లేదు.

"ఎక్కడికేనా వెడదాం—బోర్ కొడుతోంది" అందామె.

"ఎక్కడికెళదాం?"

"అలా సినిమాహాళ్ళవేపు వెళదాం."

ఆదివారం సాయంత్రం మూలానా సినిమాల వీధి విపరీతమైన రష్‌గా ఉంది. అసలు రోడ్డుమీద నడవడానికి చోటులేదు.

"అబ్బ ఆరాధన మళ్ళీ వచ్చింది; నాగేశ్వరావు, సావిత్రీ - అనవసరంగా మిస్ అయిపోతున్నాం" నవ్వుతూ అంది ఆమె. కాని అతను నవ్వలేదు. తిరిగివొస్తున్నప్పుడు ఆమె చటుక్కున వెనక్కితిరిగింది—తన పే రెవరో పిలవటం విని. ఓ నలభై యేళ్ళమనిషి నవ్వుతూ నిలబడి ఉంది. ఆమె నోట్లో కిళ్ళీ ఎర్రగా, ఆమె పళ్ళు నల్లగా ఉన్నాయి. ఆమె పేరు సత్యవతి.

అతను ముందర నడుస్తున్నాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వెనక నడుస్తున్నారు.

సత్యవతి ఆమెకి పూర్వాశ్రమంలో స్నేహితురాలు.

ఇంటిదగ్గర కొచ్చిన తర్వాత "ఆలోచించు" అంటూ సత్యవతి వెళ్ళిపోయింది.

"ఏవిటంటుం దావిడ?" అడిగాడతను.

"తర్వాత చెబుతాను."

అన్నట్టుగానే ఆమె తర్వాత చెప్పింది.

అతను నోట మాట రాకుండా అయిపోయాడు.

"ఇంపాసిబుల్."

ఆమె నవ్వింది. ఆ నవ్వులో జీవం లేదు—

"ఆవేశపడకండి. ఆలోచించండి."

"ఇందులో ఆలోచించడానికేమీ లేదు. నేను

రిక్షా లాగుదామని చూస్తున్నాను. ఎటొచ్చీ అద్దెకు రిక్షా దొరకటల్లేదు."

అతన్నెలా వొప్పించాలో ఆమెకు తెలియటల్లేదు.

"నేను చేతగాని వాణ్నని నిరూపించడానికేనా?"

"ఛఛ కాదు. అది కాదు. నా మాట వినిపించుకోండి. మనం యెలాగో ఓలాగ బతకాలి. మా అమ్మా, తమ్ముడు, చెల్లీ కూడ బతకాలి. అందుకు డబ్బు కావాలి. మీరు రిక్షా తొక్కినా మనం అందరం దానిమీద ఆధారపడి బ్రతకలేం."

"డామిట్! వాళ్ళకోసమని నువ్వొళ్ళమ్ముకోవడమేవిటి? త్యాగాలు చెయ్యడానికిదేం సినిమా కాదు."

"నేను త్యాగం చెయ్యడంలేదు. వాళ్ళ జీవితాలు ఆనందంగా సాగాలి. అది నా కోరిక. అదే నాకు అత్యంత ఆనందాన్నిచ్చే విషయం. త్యాగాలు, ధర్మాలు యివన్నీ ఎవరి ఆనందం కోసం వాళ్ళు చేసేవి. విచ్చుకుంటున్న మొగ్గలు సగంలో ఆగిపోవడం నా కిష్టంలేదు. నేనేమయిపోయినా వాళ్ళు బాగుపడాలి."

ఆమె ఉద్రేకంగా చెప్పింది. అతను మాట రాకుండా వుండిపోయాడు.

"ఏవండీ! మనం యెందుకు సిగ్గుపడాలి? మనలో యేం తప్పుంది కనుక. తప్పంటూ ఉంటే అది పరిస్థితులదీ, సంఘానిదీ...." ఆమె ఉద్రేకంగా చెప్పుకుపోతోంది. ఆమెలో అంత ఉద్రేకం అతనెప్పుడూ చూడాలేదు.

చివరికి "నా అనుమతి నీకవసరం లేదు" అని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి అడిగాడు "యేం నిర్ణయించుకున్నావ్?"

"నా నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది."

"ఏమిటి?"

"ఐదు సంవత్సరాల క్రితం అంటే మొదటిసారిగా నా కిష్టం లేకుండా డబ్బుకోసం మొగవాడికి లొంగిపోయినప్పుడు సంపాదించేనా పొట్లం. ఆ పొట్లం మనకి డబ్బుతో ప్రమేయం లేకుండా యీ లోకాన్నుంచి దూరంగా తీసుకుపోతుంది? కాని యెందుకో ఆ పొట్లాన్ని నీళ్ళల్లో కలుపుకుకొని తాగే ధైర్యం నాకు లేకపోయింది. ఆ ధైర్యం నా కిప్పటికి కూడా లేదు. మీ నిర్ణయం యింకా మారకపోతే ఆ పొట్లాన్ని నీళ్ళల్లో కలిపి మీరెళ్ళిపోండి. నా చావుకి నేనే కారణమని రాసిపెట్టి అది తాగేస్తాను. మీ కెప్పటికి కృతజ్ఞురాల్నయి ఉంటాను. మీ రా పని చెయ్యకపోతే ఒప్పుకున్నట్టే లెక్క."

అతను షాక్ అయిపోయాడు. ఆ గది లోంచి బయటకు వెళ్ళిపోయాడు అసహ్యంగా, భయంకరంగా ఉన్న చీకట్లోకి. చాలా కాలం తర్వాత అతను మళ్ళీ తన అసమర్థతను తల్చుకుని ఏడ్చాడు.

గదిలో మాటలు వినిపిస్తున్నాయి.

లైటు వెలిగింది. అంటే అతను వెళ్ళిపోతున్నాడన్నమాట.

వంటగదిలో చాపమీద పడుకుని ఉన్న అతను అసహనంగా కదిలేడు.

పదిహేను నెలల క్రితం తను రిక్షా తొక్కుతూ, ఆమె గురించి ఆలోచిస్తూ గడిపిన రోజులు యెంత బాగుండేవి! ఆ రోజులు ఎక్కడికి వెళ్ళిపోయాయి? అవి మళ్ళీ వస్తే ఎంత బాగుంటుంది?

వీధి తలుపు గడియవేసి ఆ గదికీ వంటగదికీ మధ్యనున్న తలుపు తీసిందామె.

అతను కళ్ళు మూసుకొని పడుకొనివున్నాడు.


"నిద్రపోతున్నారా?"

అతను మాట్లాడలేదు.

ఆమె లైటార్పేసి వెళ్ళి పడుకుంది. నలిగిపోయిన మల్లెపూవులు మెడవెనుక గుచ్చుకుంటున్నాయి.

ఆ రోజులు యెంత బాగుండేవి! అతను యెప్పుడొస్తాడో అని యెదురుచూస్తూ గడిపిన రోజులు. కాలం పదిహేను నెలలు వెనక్కుపోతే ఎంత బాగుంటుంది. ఆ తియ్యటి క్షణాలు యింక మళ్ళీ రావా! □






రచయిత: శ్రీ నార్ల వెంకటేశ్వరరావు
వెల: పదిహేను రూపాయలు.
ప్రతులకు: నవోదయ పబ్లిషర్స్,
విజయవాడ-2, గుంటూరు-2.

ఒక్క బిగిని చదివించే 'సీత జోస్యం'లో ఇతివృత్త మిది. మునులందరూ తమను మోసగించి, మరింత ప్రమాదమని చెబుతూనే, దక్షిణానికే తీసుకుపోతున్నారని సీత గ్రహించింది. ఇది దక్షిణాపథాన ప్రశాంతంగా జీవిస్తున్న వారిని రామునిచేత చంపించటానికేనని ఆమె అభిప్రాయం. ఈ అమానుష హత్యకాండ ఆపమని రాముణ్ణి బ్రతిమాలుతుంది, భంగపడుతుంది సీత. కుట్రలనీ కుహకాలనీ ఎత్తి చూపి ఎంత వివరంగా చెప్పినా రాముడు అర్థం చేసుకోడు. సీత మాట పెడచెవినిబెట్టి, నిర్హేతుకంగా రాక్షస సంహారమంటూ వెళ్ళిపోతాడు. ఈ చిన్న ఇతివృత్తాన్ని సుందరమైన నాటకంగా మలిచారు శ్రీ నార్ల.

ఉపసంహరణలతో సహా 131 పేజీల పీఠిక, 12 పేజీల రెండు అనుబంధాలు, 12 పేజీల రిఫరెన్సులు, 64 పేజీల నాటకం వెరసి శ్రీ నార్లవారి 'సీత జోస్యం'. వెనుక అట్టమీద 'నాకు కావలసింది మీ ఆమోదము కాదు. మీలో ఆలోచన....' అంటూ ప్రారంభించి 'మీలో కొందరికి కష్టం కలిగించటం ద్వారానే నా లక్ష్యాన్ని సాధించవలసి వస్తే అందుకు నేను వెనుదీయననటానికి నా నాటకాలే, వాటికి నా పీఠికలే తార్కాణాలు' అని వ్రాసుకున్నారు నార్లవారు.

శ్రీ నార్ల ప్రముఖ సంపాదకునిగా, గొప్ప చదువరిగా, చెప్పుకోదగ్గ స్వంత గ్రంథాలయమున్న వ్యక్తిగా—వ్యక్తిగత పరిచయంలేని వారికి కూడా—తెలిసినవారే! ఏనాడో 'మాటా-మంతీ', 'పిచ్చా-పాటీ', 'నార్ల వారి మాట' ఇత్యాది రచనలతో తెలుగు పాఠకుల మనస్సులో స్థానం సంపాదించుకున్నవారే! విపుల పీఠికలు తెలుగు మాత్రమే చదువుకున్నవారికి కొత్తైనా ఆంగ్ల సాహిత్యంతో పరిచయమున్న వారికి బెర్నార్డ్‌షా తలపుకు రాకమానదు. షా నాటకాలు ఏ మేరకు ప్రదర్శనాయోగ్యత సంతరించుకున్నాయో చెప్పవలసిన అవసరంలేదు. "'వాల్మీకి తన కావ్యనాయకుని' అనే మాటలను అర్. జీ. బండార్కర్ నిర్నిమిత్తంగా వాడలేదు. ఆయన దృష్టిలో (జాబాలి పీఠికలో నేను వివరించినట్లు) రామాయణం కావ్యమే కాని చరిత్ర కాదు...." అంటారు నార్ల (49వ పేజీలో) ఇంత నిర్దిష్టమైన అభిప్రాయ మున్నప్పుడు కావ్య రామణీయకతను కాక దాని చరిత్రనూ, దానిలో ప్రదర్శించబడిన భౌగోళిక పాండిత్యాన్నీ, పురాతత్వ విశిష్టతను, సాంఘిక ఆచారాలను ఎందుకు తీసుకోవలసి వచ్చింది అని ప్రశ్నించుకుంటే సమాధానం దొరకదు. "ఒక జాతిగా మన మనస్సు వికా

# నార్లవారి నాటకం
# సీత జోస్యం